




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| శుక్రవారం 28 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 87 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ

### మీరాలం ట్యాంక్‌ను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు





హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి హైదరాబాద్‌లోని మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ట్యాంక్ పరిసరాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి, పర్యాటకులను ఆకట్టుకునేలా ఆధునిక, అత్యుత్తమ డిజైన్లతో ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికలు, పనుల వివరాలను అధికారులు ఫోటో ప్రదర్శన ద్వారా ముఖ్యమంత్రికి వివరించగా, వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరం పనుల నాణ్యత, పురోగతి, రూపకల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. నిర్ణయించిన గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి, ఓపెన్‌టాప్ జీపులో ట్యాంక్ చుట్టూ ప్రయాణిస్తూ చేపడుతున్న పనులను పరిశీలించారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను కూడా సమీపంగా పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్షాలు, వరదల సమయంలో నీరు సులభంగా చెరువు నుంచి మూసీ నదిలోకి వెళ్లేలా నాలా విస్తరణ చేపట్టాలని సూచించారు. పర్యాటకుల కోసం చెరువులో వాటర్ స్పోర్ట్స్‌కు అనువైన ఏర్పాట్లను ప్రణాళికలో చేర్చాలని, చెరువు మధ్యలో ఉన్న ద్వీపాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మీరాలం ట్యాంక్‌ను, దాని పరిసర ప్రాంతాలను దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే స్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## తుమ్మిడిహట్టి బ్యారేజీపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం

ఢిల్లీ, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు రాష్ట్రాల మధ్య సమావేశం నిర్వహించి ప్రాజెక్టుకు సంబంధించి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అనంతరం ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలో ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు ముఖ్యమంత్రి లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల స్థాయిలో అవసరమైన నీటిని గురుత్వాకర్షణ ఆధారంగా తరలించడం సాధ్యం కాదని, భారీ పంపుల ద్వారా నీటిని తరలించాల్సి వస్తే విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగే విధంగా ప్రాజెక్టును నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదనగా ఉంది. సంబంధిత అధ్యయనాల ప్రకారం నీటిమట్టాన్ని పెంచడం వల్ల అదనంగా ఏర్పడే ముంపు పరిమిత స్థాయిలోనే ఉంటుందని కూడా కేంద్రానికి వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంలో కీలకంగా భావిస్తున్న తుమ్మిడిహట్టి ప్రాజెక్టును త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం, మహారాష్ట్రతో తెలంగాణ ప్రభుత్వం వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.

**హర్యానా** సభలో దళిత్-సిక్కు ఎమ్మెల్యే గొంతు నొక్కేస్తారా? కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

## హర్యానా అసెంబ్లీలో దళిత్-సిక్కు ఎమ్మెల్యేకు అవమానం అంటూ కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు





హర్యానా, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి హర్యానా అసెంబ్లీలో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీపై రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్‌కు చెందిన దళిత్-సిక్కు ఎమ్మెల్యే సర్దార్ జనైల్ సింగ్, 1984 ఘటనల్లో దోషిగా తేలిన సజ్జన్ కుమార్‌ను ఆదర్శంగా పేర్కొంటున్న వారిని వ్యతిరేకిస్తూ సభలో ఒక పత్రాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించగా, కాంగ్రెస్‌కు చెందిన మరో ఎమ్మెల్యే ఆ పత్రాన్ని ఆయన చేతిలో నుంచి తీసుకుని పక్కకు విసిరేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్న రాజకీయ వర్గాలు, దళితులు, సిక్కుల హక్కుల కోసం మాట్లాడుతున్నామని చెప్పే పార్టీ తన సొంత ఎమ్మెల్యేకు అసెంబ్లీలోనే మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించాయి. 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక హింసకు సంబంధించిన అంశాలు ఇప్పటికీ రాజకీయంగా సున్నితమైనవిగా ఉన్న నేపథ్యంలో, ఆ ఘటనలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వ్యక్తి గొంతును సభలోనే అణచివేయడం సరికాదని విమర్శకులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ దళితులు, సిక్కుల పట్ల తన వైఖరిని స్పష్టం చేయాలని రాజకీయ ప్రత్యర్థులు కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత కాంగ్రెస్ నేతల పూర్తి వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది.

## యశోద ఆస్పత్రిలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు.









## మోతడకలో మరో విడత భూసమీకరణకు సీఆర్‌డీఏ నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధిలో భాగంగా మరో విడత భూసమీకరణ ప్రక్రియకు అడుగులు పడ్డాయి. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామ పరిధిలో భూములను సమీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సీఆర్‌డీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో ప్రతిపాదిత కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన భూమిని అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రక్రియ ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. మోతడక గ్రామ పరిధిలో మొత్తం 2,344.12 ఎకరాల భూమి ఉండగా, ఇందులో పట్టా భూములు, ప్రభుత్వ భూములు ఉన్నట్లు సీఆర్‌డీఏ వివరించింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా సుమారు 1,654.259 ఎకరాల పట్టా భూమిని సమీకరించనున్నట్లు తాజాగా వెలువడిన వివరాల్లో పేర్కొంది. మిగిలిన భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించినట్లు సమాచారం. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఎర్రుబాలెం–నంబూరు రైల్వే మార్గం వంటి కీలక రవాణా మౌలిక వసతుల కోసం ఈ భూములను వినియోగించేలా ప్రణాళిక రూపొందించారు. రైల్వే మార్గం నిర్మాణానికి అవసరమైన భూభాగంతో పాటు దాని పరిధిలోని అవసరమైన ప్రాంతాలను, అలాగే ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం అవసరమైన భూమిని సమీకరించే ప్రక్రియ చేపట్టనున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, రైల్వే అనుసంధానం, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడంలో భాగంగానే ఈ చర్య తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రాజధాని ప్రాంతంలో రెండో దశ భూసమీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, మోతడకలో తాజాగా భూసమీకరణకు నోటిఫికేషన్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఆర్‌డీఏ అధికారిక వెబ్‌సైట్‌లో భూసమీకరణకు సంబంధించిన వివరాలు, పథకాలు, నోటిఫికేషన్లను అందుబాటులో ఉంచినట్లు తెలుస్తోంది.

# కర్ణాటకకు నిరంతర బొగ్గు సరఫరా సింగరేణి-కేపీసీఎల్ సంయుక్త భాగస్వామ్యానికి ప్రతిపాదన

బెంగళూరు, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కర్ణాటక ఇంధన శాఖ మంత్రి కే.జే. జార్జ్‌తో బెంగళూరులో సమావేశమై రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న బొగ్గు సరఫరా ఒప్పందం, కర్ణాటక విద్యుత్ అవసరాలకు సింగరేణి నుంచి జరుగుతున్న బొగ్గు సరఫరా తీరుపై ఇరువురు మంత్రులు సంబంధిత అధికారులతో సమీక్షించారు. కర్ణాటక జెన్కోకు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న బొగ్గు బ్లాకుల తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, సింగరేణి సంస్థలు సంయుక్త భాగస్వామ్యంతో బొగ్గు బ్లాకుల మైనింగ్ కార్యకలాపాల్లో ముందుకు వెళ్లే ప్రతిపాదనపై కర్ణాటక ఇంధన శాఖ మంత్రి కే.జే. జార్జ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదే విధంగా కర్ణాటక జెన్కోకు ఇంధన రంగంలో ఉన్న అనుభవాన్ని సింగరేణి సంస్థ తన భవిష్యత్ ప్రాజెక్టుల్లో ఉపయోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కర్ణాటకతో సింగరేణికి ఉన్న బొగ్గు సరఫరా ఒప్పందాలు, ప్రస్తుతం కొనసాగుతున్న సరఫరా విధానంపై ఇరు రాష్ట్రాల అధికారులు మంత్రులకు వివరాలు అందించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కర్ణాటకకు బొగ్గు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కర్ణాటక ఇంధన శాఖ మంత్రి తెలంగాణ ఉప ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క, కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రోజుకు నాలుగు బొగ్గు రేకులను సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. కర్ణాటక విద్యుత్ అవసరాల కోసం ఒడిశాలోని నైని బొగ్గు గని నుంచి సంవత్సరానికి ఒక మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు సింగరేణి సిద్ధంగా ఉందని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించగా, ఈ విషయాన్ని ఆయన కర్ణాటక ఇంధన శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశం అనంతరం సింగరేణి వేలంలో దక్కించుకున్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా లింగదహళ్లి గ్రామంలోని బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌ను భట్టి విక్రమార్క సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించనున్నారు. ఖనిజ అన్వేషణకు సంబంధించి స్థానిక అధికార యంత్రాంగంతో సమావేశమై తదుపరి చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి వెంట సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.



# వీఏఓ భవన నిర్మాణానికి స్థలం దానం

మొగలాయికోట, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి మొగలాయికోట గ్రామానికి వీఏఓ భవనం మంజూరైనప్పటికీ, నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలం గ్రామ పంచాయతీ పరిధిలో అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సింగారెడ్డి చిన్న వెంకట రెడ్డి కుమారులు బుచ్చిరెడ్డి, భద్రారెడ్డి గ్రామ అభివృద్ధి కోసం ముందుకు వచ్చి తమ తండ్రి సింగారెడ్డి చిన్న వెంకట రెడ్డి జ్ఞాపకార్థం సుమారు 120 గజాలు (ఒక గుంట) స్థలాన్ని గ్రామ అభివృద్ధి కోసం దానం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ సమక్షంలో స్థలాన్ని అధికారికంగా గ్రామ అవసరాల కోసం అందజేశారు. వీఏఓ భవన నిర్మాణం ఆగిపోకుండా తమ సొంత స్థలాన్ని గ్రామ ప్రజల ప్రయోజనం కోసం దానం చేయడం పట్ల గ్రామస్తులు బుచ్చిరెడ్డి, భద్రారెడ్డిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. తమ తండ్రి జ్ఞాపకాలను గ్రామ అభివృద్ధితో ముడిపెట్టి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని అందించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగారెడ్డి చిన్న వెంకట రెడ్డి మనవడు కిరణ్‌కుమార్ రెడ్డి కూడా చొరవ తీసుకుని కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. ఆయన సేవాభావం, ముందడుగు ఈ కార్యక్రమానికి మరింత బలాన్నిచ్చాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి వ్యక్తిగత స్థాయిలో సహకారం అందించిన దాతలకు పలువురు అభినందనలు తెలియజేయగా, కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరాల్లో పెరుగుతున్న కాలుష్యం, జీవన ఒత్తిడి నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఐమ్యాక్స్ థియేటర్ సమీపంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళా-ఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షోను మంత్రి గురువారం ప్రారంభించి, అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. 2015 నుంచి ప్రతి సంవత్సరం జనవరి, ఆగస్టు నెలల్లో నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆగస్టు 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న మేళాలో 110కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేయగా, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక రకాల మొక్కలను తీసుకొచ్చి విక్రయానికి అందుబాటులో ఉంచారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అనువైన మొక్కలతో పాటు పూల మొక్కలు, ఔషధ మొక్కలు, బోన్సాయ్, అలంకరణ మొక్కలు తదితర రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబై, బెంగళూరు, పుణే, షిర్డీ, చెన్నైతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చారు. నాగాలాండ్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన కాక్టస్ వంటి ఆకర్షణీయమైన మొక్కలు కూడా మేళాలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రజలకు అందుబాటు ధరల్లో రూ.20 నుంచి రూ.2.5 లక్షల వరకు విలువైన వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన సామగ్రి, సేంద్రియ ఎరువులు, ఇతర ఎరువులు, టెర్రకోట కుండీలు తదితర వస్తువులు కూడా ఒకే చోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అరుదైన, ప్రత్యేకమైన మొక్కలను హైదరాబాద్ ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంలో సహాయపడతాయని, ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెరగడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కల పెంపకాన్ని అలవాటుగా మార్చుకోవడం ద్వారా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చని, నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. ఐదు రోజుల పాటు జరిగే నర్సరీ మేళాను నగరవాసులు సందర్శించి తమకు అవసరమైన మొక్కలను కొనుగోలు చేసి ఇళ్లను పచ్చదనంతో నింపుకోవాలని ఆయన కోరారు.



# వృద్ధాశ్రమంలో అంజన్నగౌడ్ జన్మదిన వేడుకలు

కోదాడ, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి సీనియర్ జర్నలిస్ట్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కారింగుల అంజన్నగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు గంధం రాము ఆధ్వర్యంలో ముకుందాపురంలోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని 45 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ అధ్యాపకుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన కారింగుల అంజన్నగౌడ్ జర్నలిజం రంగంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ 35 సంవత్సరాలుగా విలేకరి వృత్తిలో కొనసాగుతున్నారని, ఆయన ప్రస్థానం యువ జర్నలిస్టులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడంలో అంజన్నగౌడ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుత కాలంలో జర్నలిజం వృత్తిని ఎంచుకుంటున్న యువత ఆయన అనుభవాలను, ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో నిర్వహించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గాంధీ, ఉపాధ్యక్షుడు సురేష్, కుడుముల సైదులు, గోపాల్, వాసు, సంపత్, శ్రీకాంత్, నజీర్, మహేష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక



హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి హైదరాబాద్ నగరం, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, సిగ్నలింగ్ వ్యవస్థ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాల కల్పన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత ఆధునీకరించి పటిష్ఠం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా, రోడ్లు-భవనాలు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నార్కోటిక్ బ్యూరో, టీజీ-సేఫ్ తరహాలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం టీజీ-టీఎంఏఆర్ఎస్ పేరుతో ప్రత్యేక, స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు ఎలక్ట్రానిక్ అమలు వ్యవస్థను బలోపేతం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, వాటిలో అధునాతన సిగ్నల్ నియంత్రణ విధానాలను వినియోగిస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ఒకే శాఖకు పరిమితమైన అంశాలు కాదని, సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని సంజయ్ జాజు పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి సంబంధించిన ట్రాఫిక్ సమాచారాన్ని ఒకే వేదికపై సమీకరించి విశ్లేషించేందుకు సమగ్ర ట్రాఫిక్ డేటా వేదిక ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా మార్చేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సాంకేతికతను కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనల గుర్తింపుకే పరిమితం చేయకుండా ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే విధంగా ఉపయోగించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలను గుర్తించేందుకు సమాచార ఆధారిత, సాంకేతిక ఆధారిత, ప్రజా ప్రయోజనకరమైన విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. AI ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి అవసరమైన ప్రాంతాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు చేపట్టాలని, వాటి ఫలితాలను పరిశీలించిన అనంతరం దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రిలో నూతన డయాలసిస్ కేంద్రం ప్రారంభం

కోదాడ, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి కోదాడ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం, ఆధునిక ఆపరేషన్ థియేటర్‌ను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, వాటి నిర్వహణ, రోగులకు అందించే సేవలపై ఆసుపత్రి యాజమాన్యంతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి రెడ్డి మాట్లాడుతూ కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నూతన డయాలసిస్ కేంద్రం, ఆధునిక ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డయాలసిస్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. నూతన ఆపరేషన్ థియేటర్ ద్వారా వివిధ రకాల శస్త్రచికిత్సలను మెరుగైన వైద్య సదుపాయాలతో నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రి యాజమాన్యం ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడాన్ని ఎమ్మెల్యే అభినందిస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, యాజమాన్య ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల నేపథ్యంలో తెలంగాణ ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, ఫ్లాష్‌ఫ్లడ్స్ నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతర పౌరుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రాథమికంగా 23 మంది తెలంగాణ వాసులను గుర్తించినట్లు వెల్లడించారు. గుర్తించిన వారి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, వారి ప్రస్తుత పరిస్థితి, ఆచూకీ తెలుసుకోవడంతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతర సమన్వయం చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నేపాల్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, నేపాల్‌లో చిక్కుకున్న లేదా ప్రభావితమైన తెలంగాణ ప్రజల కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులు, అక్కడ తెలంగాణకు చెందిన ఎంతమంది ప్రజలు ఉండే అవకాశం ఉందనే అంశాలపై విపత్తు నిర్వహణ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. నేపాల్‌లో పరిస్థితిని ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా, తీవ్రంగా పర్యవేక్షిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా తెలంగాణ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలని సూచించారు. బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో చివరిగా ఉన్న ప్రదేశం, ప్రయాణ లేదా పర్యటన నిర్వాహకుల వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు నంబర్లు అందిస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రతకు అవసరమైన సహాయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు 9871999044, 9949351270, 9618597969 ద్వారా కుటుంబ సభ్యులు సంప్రదించవచ్చని తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ కోసం అసిస్టెంట్ సెక్రటరీ ఎస్. లక్ష్మీనారాయణను 9885371189, సెక్షన్ ఆఫీసర్ కె. శ్రీనివాస్ రెడ్డిని 7997959754, సెక్షన్ ఆఫీసర్ ఇ. చిట్టిబాబును 9440854433 నంబర్లలో సంప్రదించవచ్చని వెల్లడించారు. నేపాల్‌లో చోటుచేసుకున్న విషాదకర పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, విపత్తులో చిక్కుకున్న తెలంగాణ ప్రజలకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యుల భద్రతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను కొనసాగిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు.



# దేవదుర్గ గని నుంచి బంగారం, రాగి వెలికితీసి దేశ సంపదను పెంచుదాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దేవదుర్గ, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా లింగదహళ్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న బంగారం, రాగి ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, దేవదుర్గ గని నుంచి విస్తారంగా బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సుమారు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం కలిగిన సింగరేణి కాలరీస్ సంస్థ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ బ్లాక్ అన్వేషణ హక్కులను దక్కించుకున్న విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజల సహకారంతో ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రాంతంలో బంగారం, రాగి నిక్షేపాలు సమృద్ధిగా లభిస్తే స్థానికంగా నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. అన్వేషణ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు సింగరేణి ఆధ్వర్యంలో దేవదుర్గలో ప్రత్యేక సైట్ క్యాంప్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించిన వెంటనే కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. రాకపోకలకు సౌకర్యంగా హెలిప్యాడ్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని తెలిపారు. కృష్ణానదికి ఇరువైపులా నివసిస్తున్న తెలుగు, కన్నడ ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతిక అనుబంధం ఎంతో బలమైనదని, గతంలో ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉండటంతో రెండు ప్రాంతాల ప్రజల మూలాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. స్థానిక ప్రజల సహకారంతో ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసి రెండు రాష్ట్రాల అభివృద్ధితో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ ప్రాజెక్టు దోహదపడేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు. గతంలో తాను ఈ ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉందని, ప్రస్తుతం సింగరేణి సంస్థ అధిపతిగా అదే ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. స్థానికుల సహకారంతో అన్వేషణ విజయవంతమై బంగారు నిక్షేపాలు లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. లింగదహళ్లి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి అన్వేషణ చేపట్టనున్న ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం, సింగరేణి అధికారులు సేకరించిన వివిధ ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. బంగారం, రాగి అన్వేషణ, వెలికితీతకు సంబంధించిన ప్రక్రియలు, తదుపరి కార్యాచరణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు, కర్ణాటక రాష్ట్ర అధికారులతో సమీక్ష నిర్వహించి ఖనిజ అన్వేషణ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. పర్యటన ముగింపు సందర్భంగా లింగదహళ్లిలోని చారిత్రక శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌హెచ్-65పై 17 బ్లాక్‌స్పాట్ల ఫ్లైఓవర్లను త్వరగా పూర్తి చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్-65పై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్‌స్పాట్ల వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని పలు రహదారులు, జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్–విజయవాడ మార్గంలో ఇప్పటివరకు గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్ల వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, హైమాస్ట్ లైట్ల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలపై కూడా వివరాలు తెలుసుకుని, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని అధికారులు మంత్రికి వివరించగా, పెద్దకాపర్తి ఫ్లైఓవర్‌పై ఇప్పటికే వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, సూర్యాపేట ఈనాడు కార్యాలయం సమీపంలోని ఫ్లైఓవర్ కూడా ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. చిట్యాల ఫ్లైఓవర్‌ను దసరా నాటికి పూర్తి చేసి వాహనాల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాలని, మిగిలిన ఫ్లైఓవర్లను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి సంక్రాంతి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు, కొన్ని ప్రాంతాల్లో రహదారికి రక్షణ కంచెలు లేకపోవడంపై కూడా మంత్రి ఆరా తీశారు. రహదారిపైకి పశువులు, ఇతర జంతువులు రాకుండా అవసరమైన చోట్ల రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు భద్రతా చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని జాతీయ రహదారుల అధికారులకు సూచించారు. హైదరాబాద్–విజయవాడ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి విస్తరణ పనులను వేగంగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. 6+2 లేన్ రహదారి విస్తరణకు సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి భేషజాలకు తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఎన్‌హెచ్-65 విస్తరణతో పాటు ఇతర జాతీయ రహదారి ప్రాజెక్టులను వేగంగా చేపట్టాలని కోరతామని, అవసరమైతే ప్రధానమంత్రిని కూడా కలుస్తామని తెలిపారు. ఎన్‌హెచ్-65 విస్తరణ పనులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఇతర జాతీయ రహదారి ప్రాజెక్టులు, బుల్లెట్ రైలు వంటి మౌలిక వసతుల అంశాలను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ లింగారెడ్డి, చీఫ్ ఇంజినీర్లు వసంత్ నాయక్, ధర్మారెడ్డి, జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా

హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించనున్న లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్ వెట్స్ గార్డెన్స్‌లో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన లక్కీ డ్రా నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం–పొదుపు సంఘం హాల్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని కవర్ చేయాలని నిర్వాహకులు కోరారు.



# అల్లాదుర్గ్‌లో ఘనంగా ఖురేషి కమిటీ ప్రారంభం

అల్లాదుర్గ్ మండలం, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండల కేంద్రంలోని అల్లాదుర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటైన ఖురేషి కమిటీని గురువారం బాబా షాదుల్లా దర్గా వద్ద ఘనంగా ప్రారంభించారు. ఖురేషి కమిటీ అధ్యక్షుడు చాంద్ ఖురేషి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మస్తాన్ ఖురేషి, కోశాధికారి మహేబూబ్ ఖురేషి, జాయింట్ సెక్రటరీ సద్దాం ఖురేషితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్లాదుర్ సర్పంచ్ మద్దూరి సామ్య–సురేష్ గౌడ్, అల్లాదుర్గ్ మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దశరథ్, వార్డు సభ్యుడు కలీం, ఆవుల సుధాకర్, 6వ వార్డు సభ్యుడు మంగలి పాండు తదితరులు హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖురేషి కమిటీ సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఐక్యత కోసం సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ద్వారా సమాజంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సభ్యుల మధ్య ఐక్యతను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో భారీగా ఆధునిక ధాన్య సైలోల నిర్మాణానికి ప్రణాళిక

హైదరాబాద్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి తెలంగాణలో పెరుగుతున్న వరి సాగు, ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఆధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై గురువారం సీనియర్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి సదుపాయాలు, సాగు విస్తీర్ణం పెరగడంతో వరి ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందని, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తున్న నేపథ్యంలో నిల్వ అవసరాలు కూడా ఏటేటా పెరుగుతున్నాయని తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని సురక్షితంగా, శాస్త్రీయంగా నిల్వ చేసేందుకు వ్యూహాత్మక ప్రాంతాల్లో అత్యాధునిక సైలోలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ గోదాములతో భవిష్యత్ అవసరాలను పూర్తిగా తీర్చడం సాధ్యం కాదని, ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, యాంత్రిక రవాణా, శాస్త్రీయ సంరక్షణ, డిజిటల్ పర్యవేక్షణ వంటి ఆధునిక సాంకేతికతతో కూడిన నిల్వ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. తేమ, పురుగులు, ఇతర కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యం పెరిగేలా సైలో వ్యవస్థను రూపొందించాలని పేర్కొన్నారు. సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు దోహదపడే విధంగా పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థల మధ్య బాధ్యతలను స్పష్టంగా నిర్వచించి, సైలోలు ఆర్థికంగా స్వయం సమర్థంగా, వృత్తిపరంగా నిర్వహించే నమూనాలను రూపొందించాలని ఆదేశించారు. రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి రాష్ట్ర ధాన్య నిల్వ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం పౌర సరఫరాల సంస్థ, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు సంస్థలకు చెందిన గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల సొంత నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, సీజన్ కార్యాచరణలో భాగంగా తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పెరుగుతున్న సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కొత్త సైలోల నిర్మాణం అత్యవసరమని మంత్రి స్పష్టం చేశారు. డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలను వేగంగా వసూలు చేసేందుకు పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని రూపొందించాలని, డిఫాల్టర్లపై న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రజాధనాన్ని తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. ధాన్యం నిల్వల వేలం ప్రక్రియపైనా మంత్రి సమీక్షించి, తదుపరి విడత వేలం ప్రారంభించే ముందు లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం వేదికలను ఖరారు చేయాలని ఆదేశించారు. వేలంలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి తగిన నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం ద్వారా రైతుల పంటకు భద్రత కల్పించడం, నిల్వ నష్టాలను తగ్గించడం, ప్రజాధనాన్ని కాపాడటంతో పాటు పౌర సరఫరాల వ్యవస్థను ఆధునికీకరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకులు రోహిత్ సింగ్‌తో పాటు పౌర సరఫరాల సంస్థకు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

తుంగతుర్తి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో జీడి వెంకటేశ్వర్లు, బూరుగుల రాంబాబుతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి నాయకులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు బీఆర్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గుండగాని సోమేశ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు దావుల వీరప్రసాద్ యాదవ్, తిమ్మాపురం సర్పంచ్ బోడ్డు ఇందిరా సోమరాజు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ తొండ లింగమూర్తి, ఉపసర్పంచ్ దేశిడి సందీప్ రెడ్డి, వార్డు సభ్యులు మంగదుడ్ల సత్యనారాయణ, ఆదె మధు, కోడబోయిన నరసయ్య, చెరుకుపల్లి ప్రవీణ్, మేడబోయిన గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## లింగన్నగారి అభిలాష్ గౌడ్‌కు అరుదైన గౌరవం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా బీసీల సంక్షేమం కోసం సేవలందిస్తున్న లింగన్నగారి అభిలాష్ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయనను తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యూత్ సెక్రటరీగా నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిలాష్ గౌడ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి జిల్లా యూత్ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర యూత్ సెక్రటరీగా అవకాశం కల్పించిన తన గురువు, దైవం, తాతగారు ఎంపీ ఆర్. కృష్ణయ్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బీసీల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అభిలాష్ గౌడ్ నియామకం పట్ల సంగారెడ్డి జిల్లా బీసీ సంఘం నాయకులు, యువజన విభాగం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## సాయిపేట పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: సాయిపేట పాఠశాలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ వాతావరణం ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి విద్యార్థుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై తమ సహచర విద్యార్థులకు ఆప్యాయంగా రాఖీలు కట్టి, తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలురు తమ తోబుట్టువుల సమానులైన విద్యార్థినులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉందని తెలిపారు. కేవలం రక్తసంబంధాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో సోదరభావం, మహిళల పట్ల గౌరవం, రక్షణ భావాలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతి, నైతిక విలువలను అలవర్చుకుని ప్రతి ఒక్కరినీ సోదరభావంతో గౌరవించాలని సూచించారు. రక్షాబంధన్ పండుగ విశిష్టతపై పలువురు విద్యార్థులు ప్రసంగాలు చేయడంతో పాటు పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో వివరాలు సరిచూసుకోవాలి: ఆర్‌డీఓ రమాదేవి



మెదక్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఓటరు జాబితాలో తమ వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకుని, అవసరమైన సవరణలు చేసుకోవాలని మెదక్ ఆర్‌డీఓ రమాదేవి సూచించారు. గురువారం మెదక్ పట్టణంలోని 133, 134 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలో వివరాల పరిశీలన, సవరణలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆర్‌డీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన కొత్త ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ఫారం–6 సమర్పించాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేరు, వయస్సు, చిరునామా, ఫొటో, బంధుత్వం తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా లేదా సవరణలు అవసరమైనా ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత అధికారులు ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు తన వివరాలను సరిచూసుకుని ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆర్‌డీఓ రమాదేవి కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## చట్టబద్ధమైన దత్తతే సురక్షితం

మెదక్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బాలల సంక్షేమం, సంరక్షణలో భాగంగా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో ఆమె సమక్షంలో హైదరాబాద్‌కు చెందిన దంపతులు బాలల సదన్‌లోని 11 ఏళ్ల బాలిక అపర్ణను చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా తమ కుటుంబంలోకి స్వీకరించారు. 2025లో ప్రభుత్వ మిషన్ వాత్సల్య పోర్టల్ ద్వారా చట్టబద్ధ దత్తత కోసం దంపతులు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. బాలల సంక్షేమానికి సంబంధించిన నిబంధనలను పాటిస్తూ అధికారిక ప్రక్రియ ద్వారా దత్తత తీసుకోవడం వల్ల బాలలకు సురక్షితమైన, ప్రేమతో కూడిన కుటుంబ వాతావరణం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. దత్తత తీసుకునే తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత అధికారుల మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. చట్టబద్ధమైన దత్తత ద్వారా బాలల భవిష్యత్తుకు భద్రత కల్పించడంతో పాటు కుటుంబ ప్రేమ, ఆప్యాయత, విద్య, ఆరోగ్యం, సంరక్షణ అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా దత్తత తీసుకోవడం లేదా ఇవ్వడం చేయరాదని, దత్తత విషయంలో అనధికార మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. దత్తత తీసుకున్న బాలిక బాగోగులను ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాలికను దత్తత తీసుకున్న దంపతులను కలెక్టర్ అభినందించి, బాలికకు మంచి భవిష్యత్తు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, డీసీపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ బోధి స్కూల్లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



సంగారెడ్డి, ఆగస్టు 28 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని భవాని మందిర్ సమీపంలో ఉన్న న్యూ బోధి పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు వివిధ రకాల రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రంగురంగుల రాఖీలతో ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటూ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ సోదరభావం, పరస్పర గౌరవం, ఆప్యాయత వంటి విలువలను పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగం ఓకేనా, కరస్పాండెంట్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ: మన్నె పోచయ్య




అందోల్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంగారెడ్డి జిల్లా ఎన్‌పీఆర్‌డీ ఇండియా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్, సందేశం టైమ్స్ మెదక్ జిల్లా రిపోర్టర్, తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సహాయక కార్యదర్శి మన్నె పోచయ్య (మారుతి) శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబం రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తన అక్క వెంకటమ్మతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ రాఖీ పండుగ సందర్భంగా ప్రేమాభిమానాలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ కార్యక్రమంలో మెదక్‌లో క్రియేటివ్ ఇండస్ట్రీస్‌పై వర్క్‌షాప్



మెదక్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): ఆర్ఏఎంపీ పథకం కింద ఫ్రేమ్స్ ఆఫ్ ఫౌండర్స్ కార్యక్రమంలో భాగంగా సినిమాటికా ఎక్స్‌పో, సినికా క్రియేటర్స్ కౌన్సిల్, ఎన్ఐ-ఎంఎస్ఎంఈ సహకారంతో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రియేటివ్ ఇండస్ట్రీస్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. మెదక్‌తో పాటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిల్మ్‌మేకింగ్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్, డిజిటల్ కంటెంట్, స్టోరీటెల్లింగ్ తదితర రంగాల్లో కెరీర్, ఫ్రీలాన్స్, స్టార్టప్, స్వయం ఉపాధి అవకాశాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. ఫిల్మ్‌మేకింగ్ టెక్నిక్స్, స్క్రిప్ట్ డెవలప్‌మెంట్, విజువల్ స్టోరీటెల్లింగ్, ప్రొడక్షన్ వర్క్‌ఫ్లోస్, సోషల్ మీడియా కంటెంట్ తదితర అంశాలపై నిపుణులు ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. స్థానిక వ్యవస్థాపకులు, కళాకారులు, ఆవిష్కర్తల కథలను సినిమాటిక్ స్టోరీటెల్లింగ్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సినికా క్రియేటర్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంజా శ్రావణ్ తెలిపారు. క్రియేటివ్ రంగం యువతకు ఉద్యోగాలతో పాటు ఫ్రీలాన్సింగ్, డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కంటెంట్ బిజినెస్, ఫిల్మ్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్, యానిమేషన్ వంటి అనేక అవకాశాలను అందిస్తోందని పేర్కొన్నారు. సినిమాటికా ఎక్స్‌పో, సినికా క్రియేటర్స్ కౌన్సిల్, ఎన్ఐ-ఎంఎస్ఎంఈ సహకారంతో యువ ప్రతిభ, ఆవిష్కరణలు, క్రియేటివ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, ఔత్సాహిక ఫిల్మ్‌మేకర్లు, రీల్‌మేకర్లు, క్రియేటివ్ ప్రొఫెషనల్స్, స్టార్టప్ ప్రతినిధులు, మహిళా పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి డీఐసీ మెదక్ జనరల్ మేనేజర్ వై. యాదగిరి హాజరై మద్దతు తెలిపారు. సృజనాత్మక పరిశ్రమల ద్వారా యువత స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



# మోతేలో హత్యకు గురైన దంపతుల కుటుంబానికి ప్రభుత్వ అండ: కలెక్టర్

సూర్యాపేట, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: మోతే మండలం బిక్యా తండాలో ఇటీవల దారుణ హత్యకు గురైన దంపతులు నాగులు, బుబా కుటుంబానికి జిల్లా యంత్రాంగం పూర్తి అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ భరోసా కల్పించారు. మంగళవారం బిక్యా తండాలోని బాధిత కుటుంబాన్ని వారు స్వయంగా పరామర్శించి మృతుల కుమార్తెలు జ్యోతి, సంధ్యలను ఓదార్చారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసు కింద ప్రభుత్వపరంగా అందాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50 శాతం మేర రూ.4.2 లక్షలను బాధితుల ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పరిహారం ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ దంపతుల హత్య ఘటన అత్యంత బాధాకరమని, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము వచ్చామని తెలిపారు. కేసులో పోలీసులు ప్రతి ఆధారాన్ని నిశితంగా సేకరిస్తున్నారని, త్వరగా చార్జిషీట్ సిద్ధం చేసి న్యాయస్థానానికి సమర్పిస్తామని, నేరస్థులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, జంట హత్యల కేసులో నిందితులను ఘటన జరిగిన 24 గంటలు గడవకముందే గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును మరింత లోతుగా, పారదర్శకంగా దర్యాప్తు చేసేందుకు డీఎస్పీ స్థాయి అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించామని, నిందితులను కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీలోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలను సేకరిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా నిపుణులైన ప్రత్యేక న్యాయవాది సేవలను వినియోగిస్తున్నామని, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన పరిష్కరించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవ్, స్థానిక తహసీల్దార్ వెంకన్న, సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఇతర మండల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు, తాగునీరు అందించడంలో విఫలమైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేయాలి: బొల్లం మల్లయ్య యాదవ్





కోదాడ, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: కోదాడ నియోజకవర్గ రైతులకు వెంటనే సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ సాగునీరు అందించడంలో విఫలమైన నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందించకుండా నల్లగొండ జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు నీటిని తరలిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాగర్ నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేసినప్పటికీ పాలేరు వైపు మళ్లించడం ద్వారా నల్లగొండ జిల్లా ఆయకట్టు రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులతో రైతుల బోర్లు, బావులు ఎండిపోతున్నాయని, పంట పొలాలు నెర్రలు బారుతున్నాయని, ఈ పరిస్థితుల్లో సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డెడ్ స్టోరేజ్ స్థాయిలో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ పనుల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలోనూ ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. నీటిపారుదల శాఖ మంత్రిగా కొనసాగేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేసి నల్లగొండ జిల్లా రైతాంగానికి క్షమాపణ చెప్పాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ నియోజకవర్గ రైతుల పంటలను కాపాడేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అధికారులు తక్షణమే నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# సూర్యాపేట జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ పనులు వేగవంతం

సూర్యాపేట, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, అటవీ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించాలని, ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లను విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ల పీడీఎఫ్ ఖాతాల్లో అందుబాటులో ఉన్న నిధులను అర్హులైన లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం సూర్యాపేట జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ నాగభూషణం, సూపరింటెండెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవం, VB-G RAM G, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

సూర్యాపేట, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, VB-G RAM G సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమహోత్సవం, VB-G RAM G కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ మిషన్ అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వనమహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి ప్రతి మండలానికి కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. VB-G RAM G కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులను ప్రతిపాదించాలని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకత, నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే పనులను గుర్తించి వాటి ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత ప్రయోజనం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు పంచాయతీ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అధికారులు క్రమం తప్పకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వనమహోత్సవం, VB-G RAM G, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలన్నింటినీ ఎంపీడీవోలు, ఎంపీవోలు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన ఫలితాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు, డీపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీజేపీ

కోదాడ, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే వరకు పోరాటాలను కొనసాగిస్తామని కోదాడ బీజేపీ నాయకులు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన దీక్షకు మద్దతుగా కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు దీక్షా శిబిరానికి చేరుకుని బీజేపీ నాయకులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వంగవీటి శ్రీనివాసరావు, కనగాల నారాయణ, బోలిశెట్టి కృష్ణయ్య, మహేష్, పుల్లారావు, బసవయ్య, ఓరుగంటి పురుషోత్తం, ప్రవీణ్, గణేష్, కళావతి, సీత, జల్లా జనార్దన్, ఈశ్వరరావు, ఎంఎస్ కళాశాల సీఈవో ఎస్.ఎస్.రావు, కళాశాల విద్యార్థులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వాయిల సింగవరంలో ఘనంగా వన మహోత్సవం–మెగా ప్లాంటేషన్

అనంతగిరి, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: వన మహోత్సవంలో భాగంగా అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతగిరి మండల ఏపీఓ వెంకన్న మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలని, పచ్చదనం పెంపొందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కాకర్ల సౌమ్య, గుండ్లపల్లి వెంకన్న, కంటూ వేణు, ఎం. గురవయ్య, చింత సునీత, రాజకుమారి, గోపి, సైదులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ నోటీసులు వచ్చిన వారు ఆందోళన చెందొద్దు: తహసీల్దార్ కమలాకర్

అనంతగిరి, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఓటరు జాబితాలో వివరాలు మ్యాపింగ్ కాని, చిన్నచిన్న సవరణలు అవసరమైన ఓటర్లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నామని అనంతగిరి తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో మ్యాపింగ్ కాని 155 మంది, వివిధ అనామలీస్ ఉన్న 5,823 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ప్రకారం తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) ఎదుట విచారణకు హాజరై ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధ్రువపత్రాల్లో తగిన పత్రాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ నెల 27న ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కమలాకర్ కోరారు. అలాగే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, తప్పులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి సవరణలు చేయించుకోవచ్చని సూచించారు.



## స్వర్గీయ బేగరి విట్టల్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు షూస్ పంపిణీ

మెదక్, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ స్వర్గీయ బేగరి విట్టల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన భార్య పార్వతి, సోదరుడు దామోదర్, కుటుంబ సభ్యులు జయప్రద, వంశీ, భాస్కర్ తదితరులు కలిసి బొడ్మట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి షూస్ పంపిణీ చేశారు. స్వర్గీయ బేగరి విట్టల్ జ్ఞాపకార్థం విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని, విద్యార్థుల పట్ల ప్రేమ, సామాజిక బాధ్యతతో కుటుంబ సభ్యులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ మందిర్, పాఠశాల ఉపాధ్యాయులు లత, కృష్ణ, అశోక్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ బేగరి విట్టల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.



## హర్షవర్ధన్ తేజ మృతికి బాధ్యులెవరు? నారా లోకేష్ సమాధానం చెప్పాలి: యూఎస్ఎఫ్ఐ

శెట్టూరు, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: శెట్టూరు మండల కేంద్రంలోని హాస్టల్ సమీపంలో శిథిలావస్థలో ఉన్న గోడ కూలి ఎనిమిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ తేజ మృతి చెందడం అత్యంత విషాదకరమని, మరో విద్యార్థి అక్షయ గాయపడటంతో విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారెడ్డి అన్నారు. విద్యార్థులు సంచరించే హాస్టల్ పరిసరాల్లో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాన్ని తొలగించకుండా, ముందస్తు భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్, డే వాచ్‌మెన్ విధుల్లో ఉన్నారా, ప్రమాదకర నిర్మాణంపై గతంలో ఎలాంటి హెచ్చరికలు వచ్చాయి, వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై బాధిత కుటుంబానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మృత విద్యార్థి హర్షవర్ధన్ తేజ కుటుంబానికి వెంటనే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, గాయపడిన విద్యార్థి అక్షయకు పూర్తి స్థాయి ఉచిత వైద్యం అందించడంతో పాటు అతని కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఘటనపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిర్లక్ష్యానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో శిథిల భవనాలు, ప్రమాదకర నిర్మాణాలను వెంటనే గుర్తించి తొలగించడంతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, హర్షవర్ధన్ తేజ మృతికి న్యాయం జరిగే వరకు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని బి. నరసింహారెడ్డి స్పష్టం చేశారు.



## అర్ధరాత్రి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి బంగారు పుస్తెలతాడు చోరీ.. నిందితుడు అరెస్ట్

మెదక్, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. మెదక్ పట్టణ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం సాయి నగర్ కాలనీకి చెందిన బాలెశెట్టి సులోచన (68) ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ నెల 22, 23 తేదీల మధ్య అర్ధరాత్రి సుమారు 2.40 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఇంటి తలుపు కొట్టగా, తలుపు తెరిచిన వెంటనే బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. సులోచన ఆభరణాన్ని గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగిపోగా కొంత బంగారం ఆమె చేతిలో మిగిలింది. మిగిలిన ఆభరణాన్ని నిందితుడు లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమె కేకలు విని పై అంతస్తులో నివసిస్తున్న అల్లుడు కె. లింగగౌడ్ కిందకు వచ్చేలోపే నిందితుడు తప్పించుకున్నాడు. చోరీకి గురైన బంగారు ఆభరణం విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుమారుడు బాలెశెట్టి సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 378/2026 కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బంగారు ఆభరణాల దుకాణాలపై నిఘా పెట్టడంతో పాటు అనుమానితుల కదలికలపై దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి చోరీకి గురైన సుమారు రూ.4.50 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎమ్మెల్సీ కోదండరాంకు పరిశోధన గ్రంథం అందజేత



సిద్దిపేట, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: సిద్దిపేట అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రద్ధానందం తాను రచించిన “Socio-Economic Analysis of Farmer Suicides” అనే పరిశోధన గ్రంథాన్ని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు అందజేశారు. రైతుల ఆత్మహత్యల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు రైతులను ఆత్మహత్యల వైపు దారితీస్తున్న వివిధ కారణాలను విశ్లేషిస్తూ ఈ పరిశోధన గ్రంథాన్ని రూపొందించినట్లు డాక్టర్ శ్రద్ధానందం తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను కూడా గ్రంథంలో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన గ్రంథంలోని ముఖ్యాంశాలను ప్రొఫెసర్ కోదండరాంకు వివరించారు. రైతు సమస్యలపై అధ్యయనం, పరిశోధనల ద్వారా వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష.. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



వట్పల్లి, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: వట్పల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సూర్యారావు ఆధ్వర్యంలో మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవలు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వాటిని తక్షణమే పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఎన్నికైన కొందరు సర్పంచుల స్థానంలో వారి భర్తలు కూడా సమావేశానికి హాజరై గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలి

మానూర్, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ తులసీరాం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో వేధింపులు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ వేధింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 100, 112, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, సంగారెడ్డి షీ టీమ్ 8712656772 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ చాంగుబాయి, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, ఉపాధ్యాయులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రత, బాలల సంక్షేమం, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



## గుంతలమయమైన రహదారులతో ఆటోడ్రైవర్ల అవస్థలు

అల్లాదుర్గం, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: అల్లాదుర్గం చౌరస్తా నుంచి మండలంలోని పలు గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారడంతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ఆటోలు నడపడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల కారణంగా ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ప్రయాణికులను తీసుకెళ్లే సమయంలో ప్రమాదాల భయం నెలకొందని తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని పేర్కొన్నారు. రహదారి అధ్వాన పరిస్థితి కారణంగా ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఆటోడ్రైవర్లు, స్థానికులు కోరుతున్నారు.



## ఐక్యతతో ముందుకు సాగితే మహిళలకు మరింత ప్రయోజనం

నారాయణఖేడ్, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కల్హేర్ మండలం ఇందిరానగర్ గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంఘాల బలోపేతం, నిర్వహణ, మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ ఎస్‌పీఎం బీమయ్య, డీపీఎం జాన్ కెన్నెడీ, ఏపీఎం శివకుమార్ పాల్గొని మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సంఘ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం, పొదుపు పెంచుకోవడం, అంతర్గత రుణాలను సద్వినియోగం చేసుకోవడం, సంఘ రికార్డులను సక్రమంగా నిర్వహించడం, సభ్యులందరి భాగస్వామ్యంతో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వంశీకృష్ణ, సీసీ కల్పన, సీఆర్‌పీలు సంధ్యారాణి, ప్రమీల, వీఓఏ శంకర్‌నాయక్, వీఓ అధ్యక్షురాలు లక్ష్మితో పాటు ఇందిరానగర్ స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## కృష్ణాష్టమి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న వేణుగోపాల స్వామి ఆలయం

పటాన్‌చెరు, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్: రానున్న శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని పటాన్‌చెరు జేపీ కాలనీలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ధర్మకర్త, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాకారాలకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరిస్తున్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను ఈసారి కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేపడుతున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## పెద్దారెడ్డిపేట్‌లో ఘనంగా వన మహోత్సవం





పెద్దారెడ్డిపేట్, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ప్రతినిధి మహేష్ బాబు: పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట్ గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అనే నినాదంతో గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని నిర్వాహకులు సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనం ఎంతో అవసరమని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే నాటిన మొక్కలను వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ అనసూజ లింగయ్య, ఉపసర్పంచ్ శశికళ, వార్డు సభ్యులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల తడకగా స్మార్ట్ రేషన్ కార్డులు.. పంపిణీ నిలిపివేత




ఖమ్మం, ఆగస్టు 28, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగా పలు కార్డుల్లో వివరాలు తప్పుగా ముద్రితమవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పలు మండలాల్లో మొదటి విడతగా శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టగా, హరిపురం గ్రామంలో పంపిణీ సమయంలో కార్డుల్లో గ్రామాల పేర్లు, గ్రామపంచాయతీల వివరాలు తప్పుగా ముద్రించిన విషయం వెలుగులోకి వచ్చింది. హరిపురం గ్రామానికి బదులుగా ఓదెలగా, రాయగూడెం గ్రామపంచాయతీకి బదులుగా బుద్ధారం, మోటాపురం గ్రామానికి బదులుగా రాజేశ్వరపురం పేర్లు ముద్రించినట్లు స్థానికులు గుర్తించారు. అంతేకాకుండా పలు కార్డుల్లో పోస్టల్ పిన్‌కోడ్ నంబర్లు కూడా తప్పుగా ముద్రితమైనట్లు తెలిసింది. ప్రభుత్వ పథకానికి సంబంధించిన కీలకమైన స్మార్ట్ రేషన్ కార్డుల్లోనే గ్రామాలు, గ్రామపంచాయతీలు, పిన్‌కోడ్ వివరాలు తప్పుగా ఉండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీకి ముందే సంబంధిత వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తప్పులుగా ముద్రించిన కార్డుల పంపిణీతో భవిష్యత్‌లో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమై పంపిణీని తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తప్పులను సరిచేసి, సరైన వివరాలతో స్మార్ట్ రేషన్ కార్డులను తిరిగి పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.




## డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను వార్షికంగా తనిఖీ చేసిన ఎస్పీ నరసింహ

కోదాడ, ఆగస్టు 28: సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి జిల్లా పోలీసు కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ కోదాడ డివిజన్ డీఎస్పీ కార్యాలయం, కోదాడ పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కవాతును పరిశీలించిన ఎస్పీ, కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటూ స్మార్ట్ పోలీసింగ్‌ను అమలు చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో డ్రంకన్ డ్రైవ్ రిజిస్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ రిజిస్టర్‌లను పరిశీలించిన ఎస్పీ, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువత డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ఆపరేషన్ రోప్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులపై వాహనాలు బ్రేక్‌డౌన్ అయినప్పుడు వాహనదారులు వెంటనే డయల్ 112కు సమాచారం అందించి ప్రమాదాల నివారణకు పోలీసుల సహాయం పొందాలని ఎస్పీ సూచించారు. డీఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించిన ఎస్పీ, వరకట్న వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు, తీవ్రమైన మోసాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, మైనర్లపై వేధింపులకు సంబంధించిన కేసుల దర్యాప్తు, పురోగతిని సమీక్షించారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సామాజిక, భద్రతా అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారుల వెంట ఉన్న గ్రామాల ప్రజలు, హోటళ్లు, టీ దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించి, వారి పరిధిలో భద్రతా చర్యలు పాటించేలా చూడాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన చోట్ల సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, రహదారి భద్రతకు సంబంధించి ఇతర శాఖలతో సమన్వయం, హైవే పెట్రోలింగ్‌ను నిరంతరం నిర్వహించడం, రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ముఖ్యంగా ఆన్‌లైన్ పెట్టుబడులు, అత్యధిక లాభాల పేరుతో జరుగుతున్న మోసాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. మునగాల, నడిగూడెం, చిలుకూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో యువతకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు, ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో అత్యాశకు గురై కొందరు సైబర్ నేరగాళ్ల మాయలో పడుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణతో పాటు సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పోలీసు శాఖ సమగ్రంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఎస్ఐలు నవీన్, మోహన్, స్టార్ ఆర్ఎస్ఐ అఖిల్, డీసీఆర్‌బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సీసీ సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్ అబెద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రక్షాబంధన్ సందర్భంగా పోలీస్ సిబ్బందికి విద్యార్థుల శుభాకాంక్షలు





వట్పల్లి, ఆగస్టు 28: సందేశం టైమ్స్ ప్రతినిధి మంతూరి రాజు రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వట్పల్లి మండలంలోని అక్షర పాఠశాల విద్యార్థులు పోలీస్ సిబ్బందిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అక్షర పాఠశాల ప్రిన్సిపాల్ షైక్ హిమదాస్, రాములు, జగదీష్, గణేష్, లక్ష్మి, కల్పనా తదితర ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు వట్పల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో పాటు పోలీస్ సిబ్బందికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యార్థులతో మాట్లాడుతూ "నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. దేశ రక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, అదే సమయంలో సమాజ భద్రత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడంలో విద్యార్థుల పాత్ర కూడా ముఖ్యమని వివరించారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులు పోలీస్ సిబ్బందిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి

చింతకాని, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ కాంద్ర పిచ్చయ్య కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, మండల టీడీపీ అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, సీనియర్ బీజేపీ నాయకులు మద్దినేని వెంకటేశ్వరరావు, కిలారి చంద్రయ్య తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు పలువురు నాయకులు, ప్రముఖులు వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.



## నిరుపేదలకు అండగా నిలుస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్

నారాయణఖేడ్, ఆగస్టు 28: సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కుందేళ్ల లక్ష్మమ్మ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుజ్జుపు మచ్చేందర్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి కుటుంబానికి అండగా నిలిచారు. జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మమ్మ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు చేయూతనందించడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవడం లక్ష్యంగా జీఎంఆర్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం ద్వారా వారికి కొంత ఉపశమనం కల్పించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిరెడ్డి, సిద్ధు ముదిరాజ్, వార్డు సభ్యులు సాయిలు, గొల్ల తుకారం, కుమ్మరి తుకారం, మంగలి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: గిద్దె రాజేష్

చివ్వెంల, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: వికలాంగుల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తెలిపారు. గురువారం చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో సంఘం 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో గిద్దె రాజేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే వారికి రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సంక్షేమ పథకాలతో వికలాంగుల సమస్యలు పరిష్కారం కావని, నిర్ణయాలు తీసుకునే అధికార వ్యవస్థలో వికలాంగులకు సముచిత స్థానం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఎర్రకోటపై, తెలంగాణలోని గోల్కొండ కోటపై వికలాంగుడే జాతీయ జెండా ఎగురవేసే రోజు వచ్చే వరకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి పోరాటం ఆగదని స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో వికలాంగుల శక్తిని చాటిచెప్పే విధంగా ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విస్తరిస్తామని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా వికలాంగుల హక్కుల కోసం సంఘం నిరంతరం పోరాటాలు, నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తూ ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్తోందన్నారు. భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలతో ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి వికలాంగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. "దేశానికి నరేంద్ర మోదీ చివరి సకలాంగుల ప్రధానిగా, తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డే చివరి సకలాంగుల ముఖ్యమంత్రిగా మిగిలేలా వికలాంగుల రాజ్యాధికార యుద్ధాన్ని కొనసాగిద్దాం" అంటూ సంఘం శ్రేణులకు పిలుపునిచ్చారు. వికలాంగులందరూ రాజకీయ చైతన్యంతో ఏకమై రాజ్యాధికార సాధన కోసం ముందుకు రావాలని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. వికలాంగులకు నెలకు రూ.6,000 పెన్షన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయడం, వికలాంగులపై దాడులు, వేధింపులను అరికట్టేందుకు చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, స్థానిక సంస్థల్లో ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై తెలంగాణ వికలాంగుల సమాజం మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు, జిల్లా అధ్యక్షులు గోగుల శేఖర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు పేర్ల సోమయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు మున్నా మధు యాదవ్, గుండు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన నాయకులు కొండ సైదులు యాదవ్, మోతే మండల అధ్యక్షులు జిల్లేపల్లి శివకృష్ణ, జిల్లా మహిళా నాయకులు రుక్సానా క్రాంతి, సంఘం నాయకులు భువనగిరి భద్రయ్య, శ్రీకాంత్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

## అరాచకాలు ఆపకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: లింగాల కమల్ రాజు



బోనకల్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 28: బోనకల్ మండలంలో కొనసాగుతున్న అక్రమాలు, అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు, మట్టి అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని, లేకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌వార్జ్ లింగాల కమల్ రాజు హెచ్చరించారు. బోనకల్ మండల ముఖ్య నాయకులతో గురువారం జానికిపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. భట్టి విక్రమార్క ప్రోత్సాహంతో బోనకల్ మండలంలో మట్టి మాఫియా కోట్ల రూపాయల వ్యవహారంగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల సంపదను కొంతమంది అక్రమార్కులు దోచుకుంటుంటే అధికార యంత్రాంగం, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం సరికాదన్నారు. మట్టి మాఫియాను వెంటనే అరికట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ అండదండలతో అక్రమాలు కొనసాగితే ప్రజలను సమీకరించి, కలిసొచ్చే పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పోలీసులు అధికార పార్టీ కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించిన కమల్ రాజు, పోలీసుల విధి ప్రజలందరికీ సమానంగా న్యాయం చేయడం, చట్టాన్ని కాపాడటమే తప్ప ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం కాదన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థులు సర్పంచులుగా గెలిచిన గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజలు తమ ఓటుతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల తీర్పును గౌరవించి, ఎన్నికైన సర్పంచులు స్వేచ్ఛగా ప్రజలకు సేవ చేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. భట్టి విక్రమార్క గుడిలో బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చిన హామీలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ తగ్గిపోతోందని, బీఆర్ఎస్‌పై మళ్లీ విశ్వాసం పెరుగుతోందని కమల్ రాజు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ప్రస్తుత ప్రభుత్వ పనితీరుతో పోల్చుకుంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బోనకల్ మండలంలో అక్రమాలు, మట్టి దందా, రాజకీయ వేధింపులు, దౌర్జన్యాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించి ప్రజల తరఫున ఆందోళనలు, పోరాటాలను ఉధృతం చేస్తామని లింగాల కమల్ రాజు హెచ్చరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.